క్లుప్తంగా

అమలాపురం ఇన్‌చార్జి కమిషనర్‌గా రాణి సంయుక్త



అమలాపురం ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాణి సంయుక్త

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు జిల్లాలోని రామచంద్రపురం మున్సిపాలిటీ కమిషనర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎవరూ నియమితులు కాలేదు. కమిషనర్ రాజు రామచంద్రపురంలో రిలీవ్ అయ్యాక అమలాపురం మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారిగా పనిచేస్తున్న బి.రాణి సంయుక్త ఇన్‌చార్జి కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఆమె ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఇన్‌చార్జి కమిషనర్‌గా పాల్గొని చర్చించారు. అమలాపురానికి రెగ్యులర్ కమిషనర్ నియామకం వారం లేదా పది రోజుల్లో ఉండవచ్చని తెలిసింది. అప్పటి వరకూ రాణి సంయుక్త ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



సుంకరపాలెంలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

తాళ్లరేవు: సుంకరపాలెంలోని పలు రహదారుల్లో ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు వేసే కార్యక్రమంలో భాగంగా తీసిన గోతులను పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో అవి ప్రమాదభరితంగా మారాయి. సుంకరపాలెం పంచాయతీలో జలజీవన్ పథకానికి సంబంధించి పైపులైన్ నిర్మాణం కోసం గోతులను తవ్వి పూర్తిస్థాయిలో పూడ్చిపెట్టలేదు. దీంతో ఆ గోతుల్లో పడి పలువురు పాదచారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయానికి సమీపంలో భారీ గోతులు ఉన్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఆయా గోతులను పూర్తిస్థాయిలో పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదులపై అధికారుల బృందం విచారణ



సుంకరపాలెం పంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తున్న అధికారుల బృందం

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలకు సంబంధించి అందిన ఫిర్యాదుల మేరకు అధికారుల బృందం శుక్రవారం విచారణ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఇటీవల డీఎల్‌పీఓ అన్నామణి అంశాల వారీగా విచారణ చేపట్టారు. దీనికి సంబంధించి ఈఓపీఆర్డీ వీజేవీ రమణ, పంచాయతీ కార్యదర్శులు వలీబాబా, సూరంపూడి వెంకటరమణ, నున్న శంకరనారాయణ, గ్రేడ్-5 సచివాలయ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఈఓపీఆర్డీ రమణ తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

అమలాపురం రూరల్: గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-6 హోదాలో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు గ్రేడ్-5 కార్యదర్శులుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. పాలగుమ్మి, కామనగరువు, భట్నవిల్లి, సమనస, సాకుర్రు, పేరూరు-1 పేరూరు-3, ఈదరపల్లి గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-6 హోదాలో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు గ్రేడ్ -5 కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు. వీరిలో సాకుర్రు డిజిటల్ అసిస్టెంట్ కామనగరువు-2 సచివాలయ కార్యదర్శిగా రానున్నారు. కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన మిగిలిన వారు పలు మండలాలకు బదిలీపై వెళ్లారు.



గ్రేడ్ -5 కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన డిజిటల్ అసిస్టెంట్లు

సామాజిక సమస్యగా సికిల్ సెల్

- వ్యాధి నివారణకు ప్రత్యేక ప్రణాళిక
- జన్యుపరంగా సంక్రమించే అసాధారణ వ్యాధిగా గుర్తింపు
- రక్తహీనతపై అప్రమత్తత అవసరం
- గ్రామస్థాయి నుంచి ఈ వ్యాధిపై ప్రచార కార్యక్రమాలు



బండారులంకలో రక్తనమూనాలను సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అమలాపురం రూరల్: కొన్ని వ్యాధులు ప్రకృతి సిద్ధంగా సంక్రమిస్తాయి. వాతావరణ మార్పులు అందుకు కారణం కావొచ్చు. మరికొన్ని వ్యాధులు జన్యు సంబంధంగా సంక్రమిస్తాయి. సామాజిక సమస్య నుంచి వచ్చే అలాంటి వ్యాధుల్లో సికెల్ సెల్ అనీమియా ఒకటి. మేనరిక సంబంధాలు వ్యాధి కారణం కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లో రక్తహీనత సమస్య తరచూ ఆరోగ్య సమస్యగా తీవ్రం కావడం తరచూ చూస్తుంటాం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రక్తహీనతపై ప్రచార కార్యక్రమాలను చేపడుతోంది. ఇటీవల ప్రపంచంలో చర్చనీయాంశంగా మారిన సికిల్ ఎనీమియాపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

సమస్యలకు మూలం

మహిళల్లో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వారిలో రక్తహీనత సమస్య పరిష్కారానికి పాఠశాల స్థాయిలోనే విద్యార్థినుల ఆరోగ్య వివరాలను సేకరించడం అందుకు తగిన చికిత్సను అందించడం అవసరమని గుర్తించారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం అనీమియా ముక్త్ భారత్ పథకాన్ని అమలు చేస్తున్నారు. అనారోగ్యం పాలైన సాధారణ రోగులతో పాటు విద్యార్థులు, పెద్ద వయస్సు గల ఆడవారికి సైతం రక్త పరీక్షలు చేసి రక్తహీనత నివారణకు ఈ ద్వారా కృషి చేస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం ఏరియా ఆసుపత్రి, రూరల్ బండారులంక, పేరూరు, అల్లవరం మండలంలో అల్లవరం సీహెచ్‌సీ, బెండమూర్లంక, గోడిలంక, ఉప్పలగుప్తం మండలంలో, ఉప్పలగుప్తం, ఎస్.యానాం, భీమనపల్లి పీహెచ్‌సీలుపరిధిలో రక్తహీనతపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

రక్తకణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది. శరీరం పసుపు రంగులోకి మారుతుంది. తీవ్రమైన శరీరం నొప్పులు, కీళ్లనొప్పులు వస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, త్వరితగతిన అలసట సంభవిస్తుంది. దీర్ఘకాలం కామెర్లు ఉండటం, రక్తహీతన, శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతులు, వేళ్లు వాపుతో ఒంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం గమనించవచ్చు. అంటువ్యాధులు సంక్రమించి శరీర అవయవాలు దెబ్బతింటాయి. విరేచనాలు, జ్వరం డీహైడ్రేషన్ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి.

సికిల్ సెల్ వ్యాధికి కారణాలు

జన్యుపరమైన ఎర్ర రక్తకాణాలు రుగ్మతను సికిల్ సెల్ అనీమియా అంటారు. శరీర కణజాలానికి ప్రాణ వాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్తకణాలు సికిల్ (కొడవలి) ఆకారంలోకి మారడంతో రక్త నాళాలు మూసుకుపోయి శరీర అవయవాలకు ఆక్సిజన్ అందక ప్రమాదం వాటిల్లుతుంది. వ్యాధి సోకిన వారిలో ఒక జన్యువు కొడవలి ఆకారంలోనూ, మరొకటి సాధారణ ఆకారంలోనూ ఉన్నట్టయితే వారిని సికిల్ క్యారియర్లు అంటారు. వారికి ఎలాంటి అనారోగ్యం కలగదు. కానీ ఇలాంటి లక్షణాలు కలిగిన ఇద్దరు దంపతులకు జన్మించే సంతానంలో రెండు జన్యువులు కొడవలి ఆకారంలోకి మారడంతో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పుట్టిన తర్వాత 5–6 నెలలు వరకూ వ్యాధి లక్షణాలు బయటపడవు. సాధారణంగా రక్తకణాలు 120 రోజుల వరకూ జీవించి ఉంటాయి కానీ సికిల్ సెల్ వ్యాధి బారినపడిన పిల్లల్లో 20–25 రోజులు మాత్రమే ఉంటాయి. రక్త కణం ఆకారం కొడవలి ఆకారంలో ఉండటంతో రక్తణాశాల్లో సరిగ్గా ప్రవహించకపోవడమూ, సరైన మందులు లభ్యం కాకపోవడంతో ప్రాణవాయువు అందక 15 ఏళ్లలోపే చనిపోతున్నారు.

వ్యాధి నివారణ

గిరిజన జనాభాలో ప్రతి 56 మందిలో ఒకరికి ఈ వ్యాధి సోకుతున్నట్లు గుర్తించారు. పెళ్లి చేసేముందు ఇద్దరికీ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చు. క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా నిరోధించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు

2047 నాటికి సికిల్ సెల్ అనీమియాను నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులందజేస్తుంది. సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన కార్యాచరణలో భాగంగా రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాలను చేపడుతున్నారు. అవగాహన కల్పించడం, నిర్ధారణకు పరీక్షలు చేయడం, వ్యాధి సోకిన వారికి కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినోత్సవం పాటిస్తున్నారు.

రక్త నమూనా పరీక్షలు చేస్తున్నాం



సికిల్ సెల్ అనీమియా వ్యాధి గుర్తింపునకు ఉన్నతాధికారుల అదేశాల మేరకు రక్త నమూనాలు సేకరిస్తున్నాం. విద్యార్థి దశ నుంచి రక్తహీనతపై దృష్టి సారించాలి. ప్రభుత్వం చేస్తున్న కృషికి తల్లిదండ్రులు సైతం సహకరించాలి. తరచూ విద్యార్థి ఆరోగ్యం విషయంలో మార్పులను గమనిస్తుండాలి. రక్తహీనత సమస్య పరిష్కారం కోసం ఆహారంలో ఆకు కూరలు, పండ్లు ఉండేలా జాగ్రత్తపడాలి. మాంసాహారాన్ని అందిస్తుండాలి. పెద్ద వారు ఆహారంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.

– వాసు నాయక్, బండారులంక, వైద్యాధికారి

ధాన్యంలో మొలకలు..
రైతన్నల ఆందోళన



లచ్చిపాలెంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

తాళ్లరేవు: వరి పంట మాసూళ్లు పూర్తి చేసి 20 రోజులు కావస్తున్నా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదని, వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం మొలకలు వచ్చి పాడైపోతోందని లచ్చిపాలెం గ్రామ రైతులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేసారు. వేలాది రూపాయలు అప్పు చేసి కౌలుకు వ్యవసాయం చేసామని ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతామని కౌలు రైతులు కాళ్ల వెంకటేశ్వరరావు, కనుమూరి రామచంద్రారెడ్డి, కాళ్ల గణపతి, సింగన వీరవెంకటసత్యనారాయణ, అనిశెట్టి పాల్‌రాజు, అచ్చారాజు, చింతపల్లి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు వాపోయారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని అడిగితే టార్గెట్ పూర్తయ్యిందని సమాధానం చెబుతున్నారని, ధాన్యం వ్యాపారులను అడిగితే బస్తాకు రూ.1,500 ఇస్తామంటున్నారని వారు వాపోయారు. ఎరువుల బస్తా రూ.2 వేలు పైబడి కొంటున్నామని, తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయిస్తే నష్టాలు తప్పవని రైతులు, కౌలుదారులు ఆవేదన వ్యక్తం చేసారు. ఇలా ఉండగా వారం రోజులుగా కురిసిన వర్షాలకు ధాన్యం మొలకలు వచ్చాయని తక్షణమే అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేసారు. అదేవిధంగా పి.మల్లవరంలోని కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఆర్‌యస్‌ఆర్ రకం ధాన్యం కళ్లంలో నిల్వ ఉండి వర్షాలకు మొలకలు వచ్చాయని, తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఈ మొలకెత్తిన ధాన్యాన్ని ఏ విధంగా కాపాడుకోవాలో సూచనలు చేయాలని రైతులు కోరారు. ప్రతి ధాన్యం గింజను ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతు ధూళిపూడి వెంకటరమణ కోరారు.

వేతన బకాయి విడుదల చేయాలి



భీమనపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ఉపాధి హామీ పథకం వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని భీమనపల్లి, విలసవిల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ఉపాధి కూలీలతో చర్చించారు. ఆరు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించలేదని దీంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉపాధి బకాయిలు విడుదల చేయాలని సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి పథకాన్ని ఎత్తి వేస్తామని ప్రకటిస్తూ కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకం రద్దు కాకుండా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలి రేట్లు రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇసుపట్ల మంగాదేవి, బీర వెంకట్రావు, సత్యనారాయణ, నరసింహమూరి, ఆనందరావు, వరలక్ష్మీ శారద నరసింహమూర్తి పాల్గొన్నారు.

వాసాలతిప్ప డ్రెయిన్‌లో
పూడిక తొలగించాలి



వాసాలతిప్ప డ్రెయిన్‌లో పూడిక తొలగించాలని కామనగరువులో ఆందోళన చేస్తున్న రైతులు

అమలాపురం రూరల్: కామనగరువు వద్ద పూడుకుపోయిన వాసాల తిప్ప డ్రెయిన్‌ను శుభ్రం చేయాలని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా స్టాక్ యార్డును ఏర్పాటు చేసి ఇసుకను నిల్వ చేయడం వల్ల డ్రెయిన్ మూసుకుపోయిందని రైతులు రాజులపూడి భాస్కరరావు, రాజులపూడి మురళీకృష్ణ, రాజులపూడి నాగేశ్వరరావు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల డ్రెయిన్‌లోకి దిగుతున్న వ్యర్థాల నీరు చేలల్లోకి, నివాస ప్రాంతాల్లోకి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు. డ్రెయినేజీ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందంటూ రైతులు మండి పడుతున్నారు.

ఇసుక యార్డు మార్పు

ఇసుక స్టాక్ యార్డు వల్ల వాసాల తిప్ప డ్రెయిన్ మూసుకుపోయిందని సాక్షిలో శుక్రవారం వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. స్టాక్ యార్డను కామనగరువులో బైపాస్ రోడ్డు ప్రాంతానికి యార్డును మార్పు చేశారు. తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ మూసుకుపోయిన వాసాల తిప్ప డ్రెయిన్‌ను పరిశీలించారు.

ఆధార్ నంబర్ అనుసంధానం చేయాలి

అమలాపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో జమ కావాలంటే తొలుత తమ ఆధార్ నంబర్‌ను బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ (అనుసంధానం) తప్పక చేయించుకోవాలని అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. దీనినే ఎన్‌పీసీఐ అనుసంధానం అంటారని పేర్కొన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది జీఎస్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్‌తో ఎన్‌పీసీఐ లింకేజ్ చేసిందన్నారు. అయితే జిల్లాలోని లబ్ధిదారుల్లో చాలా మంది ఇంకా బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోలేదని తెలిపారు. ఈ క్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌ను వార్డు, గ్రామ సచివాలయాల యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీలోగా అందరూ ఆధార్ సీడింగ్ చేయించుకునేందుకు చర్యలు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయడం ద్వారా సంక్షేమ పథకాల ఫలితాలు ఇబ్బంది లేకుండా అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగిన ఐపీపీబీ ఖాతాలో జమ అయిన పథకాల నగదును ఏ పోస్ట్ ఆఫీసులోనైనా తీసుకునే సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ విజ్ఞప్తి చేశారు.

తవ్వారు.. వదిలేశారు



ప్రమాదరకంగా మారిన యానాం-ద్రాక్షారామ రహదారి



రోడ్డుపై అడ్డుగా వదిలివేసిన గ్రావెల్

- పీడబ్ల్యూడీశాఖ నిర్వాకంతో ప్రమాదాలు
- ఛిద్రమైన సీసీ రహదారి

యానాం: కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన ప్రధాన రహదారులను పైపులైను పేరుతో ఛిద్రం చేయడంతో ప్రస్తుతం భారీ వర్షాలతో అవి కాస్తా ప్రమాదకరంగా మారి వాహనచోదకులకు నరకం చూపుతున్నాయి. ద్రాక్షారామ–గోపాల్‌నగర్ వరకు పైపులైను నిర్మాణంలో భాగంగా భారీ వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారిని పొక్లయిన్లతో మధ్యలో తవ్వారు. రోడ్డు మధ్యలో గుంత తవ్వి పైపులైను వేసిన అనంతరం ఆయా గుంతలను తిరిగి సరిగ్గా పూడ్చకపోవడంతో కిందికి దిగిపోయింది. దీంతో అమలాపురం, రామచంద్రపురం, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల చక్రాలు ఒక్కోసారి పైపులైను గాడిలో పడిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైను వేసేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూడకుండా ఏకంగా ప్రధాన రహదారినే తవ్వుతున్నా పాలనా యంత్రాంగం చోద్యం చూడటం దారుణమన్నారు. తక్షణం పైపులైను వెళ్లే గాడి ప్రాంతాన్ని సిమెంట్ కాంక్రీటుతో పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా
అమ్మవారి సేవ

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువైన మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి సేవను వైభవంగా జరిపించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, శక్తి వేషాలు, బుట్ట బొమ్మల కోలాహలం, తీన్‌మాన్ విన్యాసాలు, భారీ బాణసంచా కాల్పుల నడుమ సేవను అంగరంగ వైభవంగా జరిపించారు. దేవి సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ఈ సేవ నిర్వహించారు. గ్రామంలో కోలాహలం నెలకొంది. యువకులు విజిల్స్ వేస్తూ, డ్యాన్సులు చేస్తూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సేవలో పాల్గొన్నారు. కాగా ఆదివారం రాత్రి అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. సోమవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందన్నారు. అమ్మవారి జాతరలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన

తాళ్లరేవు: హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ పితానివారి పేటలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధనలో సుమారు నాలుగువేల మంది భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ సమావేశంపై ఉత్కంఠ

యానాం: న్యూఢిల్లీలో ఈనెల 24న నిర్వహించనున్న నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొంటారా అని శుక్రవారం విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో స్పందించి ధన్యవాదాలు అంటూ సీఎం రంగసామి లేచి వెళ్లిపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. రంగసామి వ్యవస్థాపక పార్టీ ఎన్‌ఆర్ కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి నాలుగున్నర ఏళ్లుగా ప్రభుత్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రణాళికా సంఘం స్థానంలో నీతి ఆయోగ్ ఏర్పడటంతో ప్రధాని అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు.కేంద్ర బడ్జెట్‌లో ఏపీ, బీహార్ మినహా మిగిలిన రాష్ట్రాలకు నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, పంజాబ్, కేంద్రపాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, ఢిల్లీ ముఖ్యమంత్రులు గతేడాది జూలైలో నిర్వహించిన సమావేశానికి హాజరుకాలేదు. అయితే ప్రస్తుతం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కావాలని కేంద్రం ఆహ్వానం పంపింది. ఈ నేపథ్యంలో సీఎం రంగసామి నిర్ణయంపై ఉత్కంఠ రేపుతుంది. ఆయన నిర్ణయం వచ్చే 2026 అసెంబ్లీ ఎన్నికల పొత్తుపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

30లోగా దరఖాస్తు నకలును సమర్పించాలి

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖలో కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత నకలు పత్రాన్ని ఈనెల 30లోగా సమర్పించాలని శుక్రవారం సూపరింటెండెంట్ ఇంజనీరు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 25 ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత అవసరమైన పత్రాలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు నకలు పత్రాలను గడువు తేదీలోగా ది సూపరింటెండెంట్, ఇంజనీర్ కమ్ హెడ్‌ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, విద్యుత్ శాఖ కార్యాలయం, 137, ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్డు, పుదుచ్చేరి– 605001కి పంపాలని కోరారు.

రేషన్‌షాపుల ద్వారా త్వరలో గోధుమల పంపిణీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా రేషన్‌షాపుల ద్వారా త్వరలో గోధుమల పంపిణీని ప్రారంభిస్తున్నట్లు పుదుచ్చేరి సీఎం రంగసామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిరంతరాయంగా ఉచిత బియ్యం పంపిణీ కొనసాగుతోందన్నారు. త్వరలోనే యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్ల వ్యాప్తంగా అన్ని రేషన్‌కార్డుదారులకు గోధుమలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కోన



ముమ్మిడివరం: నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా ప్రముఖ న్యాయవాది కోన వెంకట శ్రీనివాసరావు శుక్రవారం ముమ్మిడివరంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా విధులు నిర్వహించారు. శ్రీనివాసరావు నియామకంపై కోరసిక సత్తిబాబు, పళ్ల వీరబాబు, వస్త్రాల వీరన్న హర్షం వ్యక్తం చేశారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా



చింతలూరులో ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ ఈ కళాజాతాను ప్రారంభించారు. కళాకారులు బుర్రకథ రూపంలో హెచ్‌ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధి ఒక సామాజిక రుగ్మతగా భావించి వ్యాధిగ్రస్తులపై వివక్ష ప్రదర్శించకుండా మానవత్వంతో ఆదరించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందనవసరం లేదని రోగ నిరోధక శక్తిని పరిపుష్టం చేసి ఆయుర్దాయం పెంచే ఏఆర్‌టీ మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. అలాగే అంటువ్యాధులైన ఎయిడ్స్, క్షయ వ్యాధితో పాటు సుఖ వ్యాధులు సోకిన రోగులు తీసుకోవలసిన చికిత్సను సవివరంగా తెలియజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకే ఈ కళాజాతా ప్రారంభించామని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ సంస్థ తెలియజేసింది. ఐసీడీపీ కౌన్సిలర్ నాగలక్ష్మి, వైద్యారోగ్య, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.